# రెండు గుప్పిళ్ళ ఊపిరి

"ఆగవయ్యా....ఆగు ఎ.సి. కంపార్టుమెంటులోకి తోసుకుని ఎక్కేవాణ్ణి నిన్నొక్కడినే చూశాను.... రెండు నిమిషాలు ఆగలేవా?" నాకంటే ముందు ఎక్కబోతున్న వ్యక్తిని గదమాయించి ముందు ఎక్కేశాను.

ఆ వ్యక్తి కంపార్టుమెంటుగేటు దగ్గర అతికించిన ప్రయాణీకుల రిజర్వేషన్ చార్ట్ చూస్తూ ఆగిపోయాడు.

"ఎప్పుడన్నా ఎ.సి. కంపార్టుమెంటులో కూర్చున్న బాపతులా లేదు.... ఆబగా ఎక్కబోయాడు..... మామూలు స్లీపర్ కోచ్ అయి ఉంటుంది" అన్నాను. నా వెనకాలే ఎక్కిన మా ఆవిడతో.

"మీరు మాత్రం ప్రమోషన్ వచ్చాక గదా ఎ.సి. కంపార్టుమెంట్ ఎక్కుతుంది.... అదీకాక ఎల్.టి.సి. కాబట్టి గవర్నరుమెంటు ఈ ఖర్చు భరిస్తుంది కాబట్టే ఎక్కుతున్నారు" అనేసింది ఇందిర.

మా ఆవిడ మాటలు అతనెక్కడ విన్నాడోనని వెనక్కు తిరిగి చూశాను. అతనింకా గేటుదగ్గరే నిలబడి పక్కనే ఉన్న పాతికేళ్ళ కుర్రాడితో ఏదో మాట్లాడుతూ ఉన్నాడు.

అటెండర్ పోర్టర్ చేత సామానంతా మా బెర్తుల కింద సర్దించేడు.

"మీరు నిడుబ్రోలు స్టేషన్లో దిగగానే స్టేషన్ బయట మన పోలీసు డిపార్టుమెంటు జీపు రెడీగా ఉంటుంది సార్! డిఐజీగారు ఫోన్లో మాట్లాడి ఏర్పాటు చేశారు.... ఇక నేను ఉంటా సార్" సెల్యూట్ కొట్టి వెళ్ళిపోయాడు కానిస్టేబుల్.

మా ఆవిడవైపు గర్వంగా చూశాను.

"మీరు హోమ్‌డిపార్టుమెంటులో అసిస్టెంటుసెక్రటరీ కాబట్టి ఈ మర్యాదలు చేస్తున్నారు .... మీరు రిటైరైతే ఎవరూ పలుకరించరు" అనేసింది ఇందిర వసుమతివైపు చూస్తూ.

వసుమతి నవ్వుకుంది.

... రన్నింగ్ కామెంటరీ చెయ్యకుండా ఉండదు గదా! మా ఆవిడవైపు చురచురా చూశాను. నా చూపుల్ని పట్టించుకోదు.

డోర్ దగ్గర నేను గదమాయించిన వ్యక్తి మా ఎదుటి బెర్త్‌లోనే సెటిల్ అయ్యాడు. అతని కొడుకేమో... పాతికేళ్ళ ఆ కుర్రాడు తండ్రి పక్కనే కూర్చుని వసుమతిని తినేసేటట్లు చూస్తున్నాడు.

"మగపిల్లలు కూడా ఇంత అందంగా ఉంటారా?" మెల్లగా నా చెవిలో గొణిగింది. ఆ కుర్రాడివైపు చూస్తూ మా ఆవిడ.

.....దీనికస్సలు బుద్ధిలేదు. మనసులో ఏ ఆలోచన వస్తే అది పైకి అనెయ్యడమేనా?

ట్రెయిన్ బయల్దేరేముందు ఆ కుర్రాడు దిగేశాడు.

హమ్మయ్య.... కొంత టెన్షన్ తగ్గింది.

ఇంగ్లీషు మేగజైన్ తిరగెయ్యడం మొదలుపెట్టాను. పేజీలు తిరగేస్తూ ఉన్నానేగాని దృష్టి ఎదురుగా కూర్చున్న వ్యక్తి 'ఏం చేస్తున్నాడా?' అనే విషయం మీదే ఉంది.

యాభై అయిదేళ్ళుంటాయి. తెల్లటి డ్రెస్‌లో మనిషి నీటుగానే కన్పించాడు. దొంగ వెధవ కాదు.... నమ్మకం ఏర్పడింది. ఆ వ్యక్తిని పరిశీలనగా చూసినప్పుడు.

పేపరు తిరగేస్తున్నాడు. రాజకీయ వార్తలకంటే అతనెక్కువగా బిజినెస్ కాలమ్స్‌కేసి చూస్తుండటం గమనించాను. జేబులో సెల్‌ఫోన్ కూడా ఉన్నట్లు లేదు... ఈయనకెందుకూ ఎ.సి.కంపార్ట్‌మెంట్?.....

కాఫీ, టీ అమ్మే అబ్బాయి వస్తే తను రెండుసార్లు తాగేడు. అతను తాగలేదు... పీనాసి పిచ్చయ్యలా ఉన్నాడు....

"ఏం చదువుతున్నావ్ తల్లీ?" వసుమతిని అడిగాడు.

నాతో మాట్లాడవచ్చుగా! ఎక్కడ పన్జేస్తున్నారని అడగొచ్చు గదా! ఎక్కడ సచివాలయంలో హోమ్‌డిపార్టుమెంటులో తనెంత స్ట్రిక్ట్ ఆఫీసరో- అన్నీ వివరంగా చెప్పేవాడేగా! చిన్నపిల్లతో మాటలేమిటి? ఎటికెట్ తెలియని మనిషి..

"ఎమ్.సి.ఎ.అంకుల్."

'బాగా చదువుకొని ఫారిన్ ఛాన్స్ వస్తే వెళ్ళమ్మా."

"మాకు ఈ అమ్మాయి ఒక్కతే అన్నయ్యగారూ! మంచి సంబంధం వస్తే పెళ్ళిచేసి కళ్ళముందు ఉంచుకోవాలనుకుంటున్నాము" అంది ఇందిర.

వాళ్ళు ముగ్గురూ కబుర్లలో పడిపోయారు. నేనున్నాననే విషయమే మర్చిపోయి. ఆయన పేరు చిట్టిబాబు. అంతకుమించి వివరాలు చెప్పలేదు.

ఒళ్లు మండిపోయింది.

అబ్‌నాక్షస్ ఫెలో.... కంట్రీ బ్రూట్....

అతన్ని మనసులో తిట్టుకున్నాను.

"ఆకలవుతుంది.... అన్నం పెట్టేసెయ్యి" వాళ్ళ సంభాషణ తుంచివెయ్యాలని అన్నాను" ఆకలి కాకపోయినా, 'తొమ్మిది కాలేదు.... అప్పుడే మీకు ఆకలయ్యిందా.... సర్లే తినేయండి" బెర్త్ కింద ఉన్న బుట్టలో నుంచిక్యారియర్ తీసింది ఇందిర.

ఆంగ్లభాష మనదేశంలో ఎలా చొచ్చుకుపోయిందో వివరిస్తున్నారాయన వసుమతికి.

"వ్యాపారం చేసుకోవడానికి మొగలాయి చక్రవర్తి జహంగీరు ముందు పడిగాపులు కాసిన తెల్లవాళ్ళు చివరికి మొగలాయి చక్రవర్తి బహాదూర్‌షాను బంధించి దేశం మొత్తాన్ని ఆక్రమించేశారు. వాళ్ళ ఇంగ్లీషు నేర్చుకుని జాతీయభావం, దేశభక్తి పెంపొందించుకుని ఉద్యమాలు చేపట్టారు మనవాళ్లు. ఆంగ్లభాష మన దేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ భాషలు మాట్లాడే నాయకులను ఒకే వేదికమీద నిలబెట్టడానికి ఉపయోగపడింది. ఉద్యోగఅవకాశాల కోసం- ఇరవై ఆరు- తక్కువ అక్షరాలతో ఉన్న ఇంగ్లీషుభాష నేర్చుకుని ఇంగ్లీషువాడిని తరిమితరిమి కొట్టారు" చెప్పుకుపోతున్నాడు చిట్టిబాబు.

"కబుర్లు చెబుతున్నారుగానీ 'మీల్స్'కు ఆర్డర్ కూడా ఇవ్వలేదు. తెచ్చుకున్నాడో లేదో ...ఆకలితో అలాగే బెర్త్‌మీద పడుకుంటాడేమో! పీనాసి వెధవ....." మనసులోనే తిట్టుకున్నాను.

"మీరేమన్నా తెచ్చుకున్నారా అన్నయ్యగారూ" మా ఆవిడ అడిగింది.

ఈవిడకు ఎందుకూ? అనవసర ప్రసంగం....

"లేదమ్మా.... బయట తిండి పడదు. మా ఆవిడకష్టపడి ఏదో తయారుచేసి చిన్న బ్యాగులో పెట్టింది. వచ్చేటప్పుడు తీసుకురావడం మర్చిపోయాను."

"మీరు కూడా తీసుకోండి" బలవంతంగా పులిహోర, పెరుగు అన్నం ప్లేట్లో పెట్టి చిట్టిబాబుకు వసుమతి ఇచ్చింది.

చిట్టిబాబు శ్రీకృష్ణపరమాత్మ ఫోజుపెట్టి చిద్విలాసంగా ఆరగించాడు.

❖ ❖ ❖

నిడుబ్రోలు స్టేషన్‌రాగానే హడావుడిగా దిగేశాం. ఎక్కువసేపు ఆగదని.

మా వెనుకే చిట్టిబాబు కూడా దిగడంతో ఆశ్చర్యపోయాను.

స్టేషన్ బయట ఉన్న గవర్నమెంటు వెహికిల్‌లో ఎక్కి కూర్చున్నాం.

"ఆయన కూడా వస్తారేమో కనుక్కోండి. జీప్‌లో ఖాళీ ఉందిగా" అంది ఇందిర.

"చాల్లే... ఊరుకో! పెళ్లికి వెళుతూ పిల్లిని వెంటబెట్టుకుని వెళ్ళినట్టు అత నెందుకు?" మా ఆవిణ్ణి కసురుకున్నాను.

రెండు పనులమీద ఊరిప్రయాణం పెట్టుకున్నాం. ఒకటి బాల్య స్నేహితుడు బల రామయ్య కూతురి పెళ్లికి అటెండ్ కావడం... రెండోది పొలం అమ్మేయడం. కూతురి పెళ్లికి డబ్బుసమకూర్చుకోవాలి. తమ్ముడికి డబ్బు అవసరంగా ఉంది.... అప్పుల్లో ఉన్నాడు. పంటలు సరిగ్గా పండక ఇద్దరి పేరుమీద ఉన్న బాడవ పొలం మూడెకరాలు అమ్మేయాలి.

పచ్చటిపొలాలమధ్య తారు రోడ్డుమీద జీప్ కుదుపులు లేకుండావెళ్ళిపోతుంది. అదివరకు స్టేషన్ నుంచి ఊళ్ళోకి వెళ్ళాలంటే డొంక రోడ్డుమీద గుండా నడిచివెళ్ళాల్సి వచ్చేది. ఈ మధ్యే తారురోడ్డు పడింది. ఎటుచూసినా పచ్చటి పొలాలు...దిబ్బలమీద దట్టంగా చెట్లు...పిట్టల కిలకిలారావాలు...పొలంపనులకు వెళ్తున్న కబుర్లు చెప్పుకుంటూ-ఎక సెక్కా లాడుకుంటూ-సందడిగావెళ్తున్న కూలీలు... శరీరాన్ని మృదువుగా స్పృశిస్తున్న చల్లటి గాలి.

మనసుకు హాయనిపించింది. రిటైరయ్యాక స్వగ్రామంలోనే ఉండిపోవాలి. హైదరాబాద్ వదలి తను ఉండగల్గుతాడా?

ఆహ్లాదకరమైన ఆ వాతావరణం ప్రశాంతతకు భగ్నం కల్గిస్తూ, సెల్‌ఫోన్ మోగింది.

ఎవడో... ఏదో ఆఫీసు పని గురించి మాట్లాడుతున్నాడు. తప్పదుగదా... వాడికి సమాధానం చెప్పాలి.

ఇంటికొచ్చేక జీప్ పంపించేశాను.

"ఏరా! అందర్నీ మర్చిపోయినట్లున్నావే! నాలుగేళ్ళకీ ఐదేళ్ళకీ ఒకసారా వచ్చేది.... ఇదెవరూ? చీమిడిముక్కు సీతమ్మేనా?" వసుమతి ముక్కుపట్టుకుని పలుకరించేడు భూషయ్య తాతయ్య.

తొంభైయేళ్ళు దాటినా మనిషి రాయిలాగే ఉన్నాడు. ఆయన తాతయ్యకి తమ్ముడు. పిల్లాజెల్లా లేరు.... పొలం పుట్రా ఏమీ లేదు... తమ్ముడింట్లోనే పడి మేస్తూ ఉన్నాడు.

"నీకెందుకురా ఈ ముసలాయన బరువు వదిలించుకో" అన్నానోసారి తమ్ముడితో అంతకుముందు స్వగ్రామం వచ్చినప్పుడు.

నావైపు తీక్షణంగా చూశాడు. ఏదో అనగూడని మాట నేను అన్నట్లుగా వాడికి కోపం వచ్చింది.

"ఇంటికి పెద్దాయన ఆయనే! అయినవాళ్ళం మనం తప్పితే తాతయ్యకి ఎవ్వరున్నారు?" కోపాన్ని తమాయించుకుని బదులిచ్చేడు తమ్ముడు. "ఆయన పక్కన నిలబడితే మర్రిచెట్టు నీడలో నిలబడినట్లు ఉంటుంది. అన్ని చెట్లూ మనకి పనికివస్తాయా? అన్నీ తియ్యటి పళ్లు ఇస్తాయా? కలపో, పళ్ళో, ఔషధంగానో - ఏదోవిధంగా ప్రతి చెట్టూ మనకి ఉపయోగపడుతున్నట్లుగానే ప్రతి మనిషితో ఏదో ఒక అవసరం ఉంటుంది. ఊళ్ళో ఏ శుభకార్యం, అశుభకార్యం జరిగినా ఆయన సలహా లేకుండా ఏ పనీ చెయ్యరు. పాత ఆచారాలు, పద్ధతులు ఆయనకు తెలిసినట్లు ఎవ్వరికీ తెలియవు" అన్నాడు తమ్ముడు. మళ్లీ మరోసారి ఆ టాపిక్ తన దగ్గర తీసుకురావద్దన్నట్లుగా- వాడి బాడీ లాంగ్వేజ్‌బట్టి అర్థమయ్యింది. శివయ్య తీరే అంత.

"ఏమిటి నాన్నా! తాతగారు సీతమ్మ అంటున్నారు" అడిగింది వసుమతి.

"వాళ్ళావిడ చనిపోయిన నెలరోజులకే నువ్వు మీ అమ్మ కడుపులో పడ్డావ్.... వాళ్ళావిడ సీతమ్మ మళ్ళీ నీ రూపంలో వచ్చిందని ఆయన భ్రమ."

వసుమతితో మాట్లాడుతున్నవాడినల్లా చటుక్కున ఆగిపోయాను. ఇంటిగేటు దగ్గర చిట్టిబాబును చూసి "మళ్ళీ ఇక్కడ తగలడ్డాడేమిటి?" అనుకున్నాను మనసులో.

ఇంట్లోకి రాకుండా ఇంటిముందు పూలమొక్కలతో ఏవో కబుర్లు చెబుతున్నట్లు నిలబడ్డాడు. ఎర్రగులాబీలను చేతులతో నిమిరేదు.... నందివర్ధనం పువ్వు కళ్ళకు అద్దుకోవడం... మల్లెపందిరి దగ్గర నిలబడి ముచ్చటపడి నిలబడి మెలికలు తిరిగిపోవడం.... మామిడిచెట్టుమీద వాలిన పిట్టల్ని పలుకరించడం.... అదే ఆ ఎక్స్ట్రాలే నాకు నచ్చవ్.

"మన ఊళ్ళో పెళ్లికే వచ్చాడంట తాతయ్యా! బలరామయ్య వియ్యంకుడికి తమ్ముడి వరస అవుతాడట. పెళ్లికొడుకు తరపువారు. రైలుస్టేషన్ నుంచి రిక్షా కట్టించుకోకుండా పొలాలకు అడ్డంపడి వస్తుంటే పలుకరించి ఇంటికి తీసుకువచ్చా! పెళ్ళివారింట్లో అంతా తొడతొక్కిడిగా హడావుడిగా వుంటుంది కదా! స్నానం చెయ్యాలన్నా తాపీగా కాళ్లు చాపుకుని పడుకోవాలన్నా వీలుండదు. అందుకే మనింటికి తీసుకువచ్చా?" అన్నాడు శివయ్య.

"మంచి పని చేశావురా అబ్బాయ్" తమ్ముడిని మెచ్చుకుంటూ – "వారికి స్నానానికి ఏర్పాటు చెయ్యరా" అంటూ పురమాయించేదు భూషయ్య తాత.

భూషయ్య తాతకు పాదాభివందనం చేశాడు చిట్టిబాబు. ఊళ్ళో ఉన్న రెండురోజులు భూషయ్య తాతకు అతుక్కుపోయాడు.

పెళ్ళి పందిట్లో ఆయన పక్కనే కూర్చుని పెళ్లిలో జరిగే కార్యక్రమాలగురించి ప్రశ్నలు వెయ్యడం, ముసలాయనేమో తాపీ ధర్మారావులా సమాధానాలు ఇవ్వడం- ఇదీ వరస.

"కలశారాధన ఎందుకు చేస్తారు తాతగారూ?"

"కలశం ముందు కూర్చుని పూజచేస్తే దేవతలు ఆశీర్వదిస్తారు. సముద్రాలు, నదులు కలిసేచోట నీరు పవిత్రంగా ఉంటుందంటారే... పూజతో కలశంలోని నీరు కూడా అంతే పవిత్రంగా మారుతుంది. ఆ పవిత్ర జలాన్ని చల్లుకుంటే పవిత్రత కల్గుతుంది."

"పెళ్లికొడుకు, పెళ్లికూతురు మధ్య దుప్పటి ఉంచుతారెందుకు?"

"వెనుకటి రోజుల్లో బాల్య వివాహాలు చేసేవాళ్ళు. పెళ్ళికూతురు పెళ్లిపీటల మీదకు రాగానే ముసలి పెళ్ళికొడుకును చూసి మూర్ఛపోకుండా కొంతసేపు కూర్చుని స్థిమిత పడటానికి ఇద్దరి మధ్య దుప్పటిఉంచేవారు. అదే ఆచారం ఇప్పుడూ కొనసాగుతూఉంది."

"ముహూర్తం సమయంలో జీలకర్ర, బెల్లం నెత్తిమీద పెట్టేటప్పుడు తాళిబొట్టు కట్టేటప్పుడు భజంత్రీలు చెవులు చిల్లులుపడేటట్లు వాయిస్తారెందుకు?"

"శుభకార్యం జరిగేటప్పుడు తుమ్ము శబ్దం వినబడితే అశుభం.... అందుకే తుమ్ములు

వినబడకుండా గట్టిగా వాయిద్యాలు వాయిస్తారు" అనేశాడు భూషయ్య నవ్వుతూ.

అందరితో కలివిడిగా తిరిగేడు చిట్టిబాబు.... ఏదో బాగా దగ్గర చుట్టమైనట్లు. మంచినీళ్లు కావాలన్నా వక్కపొడి కావాలన్నా వసుమతిని అడిగేవాడు.

తమ్ముడి కొడుకు వివేక్‌తో కూడా సాఫ్ట్‌వేర్ ఫీల్డ్ గురించి లెక్చర్ దంచేడు.

"అమెరికాలో సిలికాన్‌వ్యాలీలో ఎక్కడచూసినా ఇండియన్సే... మనవాళ్ళు డాలర్లు పండిస్తూ ఉన్నారు. ఇండియన్స్ ఆర్.ఆన్ టాప్ ఇన్ సాఫ్ట్‌వేర్.... చైనీస్ ఆర్ ఆల్సో కంపీటింగ్ విత్ అజ్, బట్ దే హేవ్ లాంగ్వేజ్‌ప్రాబ్లమ్.... ఇంగ్లీషులో మనవాళ్ళకున్నంత ప్రొఫిషియన్సీ వాళ్ళకు లేకపోవడంతో వెనకబడిఉన్నారు. దే ఆర్ గుడ్ ఎట్ హార్డ్‌వేర్ ఫీల్డ్."

ఒక్కరోజులోనే ఇంట్లో అందరికీ ఆప్తుడైపోయాడు.

పెరట్లో కొబ్బరిచెట్ల నీడలో బావి దగ్గర చన్నీళ్ళ స్నానం.... వివేక్‌ను వెంటబెట్టుకుని పొలాల్లోకి, తోటల్లోకి షికార్లు... చిట్టిబాబు బాగానే ఎంజాయ్ చేస్తున్నాడు. మనసు ఓ క్షణం మూల్గింది. 'ఈ గడ్డమీద పుట్టిపెరిగిన తను ఎందుకు సంతోషంగా ఉండలేక పోతున్నాడు....' మెదడులో ఓ ప్రశ్న మెదిలింది.

"మా శివయ్య కొడుకు వివేక్‌కు ఏదన్నా ఉద్యోగం చూసిపెట్టు బాబూ. అలాగే, నీకు తెలిసినవాళ్ళలో మా వసుమతికి తగిన వరుడ్ని చూడు." చిట్టిబాబు వెళ్ళబోయే ముందు పక్కన కూర్చోబెట్టుకుని చెప్పాడు భూషయ్య తాత. పెద్దాయన చేతులు నిమిరేడు చిట్టిబాబు. చిట్టిబాబు వెళ్లిపోయాక భూషయ్య తాతను అడిగాను–

"నా కూతురికి మంచి సంబంధం నేను చూసుకోలేనా? వివేక్ ఉద్యోగం సంగతి కూడా అతనికి చెప్పాలా? సచివాలయంలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాను.... నాకు చెప్పకుండా అతన్ని అడిగావెందుకు?"

"నీకూ ఆయనకూ చాలా తేడా ఉందిరా... ఏదైనా పని నీకు అనవసరమనుకుంటే నిర్మొహమాటంగా మొహం తిప్పుకుంటావ్..... ఆయన పని జరిగే మార్గం ఉందేమో ఆలోచిస్తాడు. ముందూ వెనకాచూసి, అన్నీ ఆలోచించి అడుగువేసే మనిషి...కాస్త కూడా గర్వం లేదు...మనిషిని చూడగానే చాలా పెద్ద మనిషిలా కన్పించేడు. బయటికి ఏదీ పొక్క నియ్యలేదు గాని ఆయన కోటీశ్వరుడే.... నీ కూతుర్ని తెగ మెచ్చుకున్నాడు. తను స్నానం చేసేక విడిచిన బట్టలు సూట్‌కేస్‌లో పెట్టుకోబోతుంటే లాక్కునిఉతికిందట... నీ కూతుర్ని కోడలిగా

చేసుకోవాలనే ఉబలాటం అతనికి ఉన్నట్లు పసిగట్టాను. ఇవన్నీ పండిపోయిన జీవితం నేర్పిన పాఠాలురా అబ్బాయ్... అన్నీ అందరూ స్పష్టంగా చెప్పరు.... మనంకొంచెం ఊతం ఇస్తే అల్లుకుపోతారు. శరీరంలో రెండు గుప్పెళ్ళ ఊపిరి ఊగిసలాడుతూ ఉంటుంది.... ఆ ఊపిరి గాల్లో కలిసిపోకముందే, గుండె గూటిలోని చిలుక ఎగిరిపోక ముందే నలుగురికి మనం ఉపయోగపడాలి. ఆ లక్షణాలు నీలో కనబడలేదు... అందుకే నీకు చెప్పలేదు" అని ముగించాడు ముసలాయన.

❖ ❖ ❖

వారం రోజులు గడిచాక. మా ప్రిన్సిపల్ సెక్రటరీతో కలిసి కార్లో ప్రశాసన్‌నగర్ వెళ్ళాను.విఐపిలు ఉండే ఏరియాఅది. అన్నీ ఇంద్రభవనాలే...ఎక్కడ చూసినా ఖరీదయిన మెర్సిడెస్ బెంజ్, స్కోడా కార్లే!

మా ఆఫీసరు ఇంటిపక్కనే ఉన్న పెద్ద భవంతి ముందు పూలమొక్కలకి నీళ్ళు పోస్తున్న చిట్టిబాబును చూడగానే ఆశ్చర్యపోయాను. "ఈ తోటమాలా నా కూతురికి సంబంధం చూసేది?....."

"ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలయ్యా అందరూ! మంచి వర్క్ కల్చర్ ఉన్న మనిషి..పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీకి అధిపతి... కోటీశ్వరుడు... కొంచెం ఖాళీ దొరికినా ఇల్లు తుడుస్తాడు. అంట్లు తోముతాడు, మొక్కలకి నీళ్ళుపోస్తాడు. బట్టలు ఉతుక్కుంటాడు... వెరీ గుడ్ నేచర్డ్ మాన్...." మా మేడమ్ చిట్టిబాబును పొగుడుతూనే ఉంది.

నన్ను చూసి పరుగుపరుగున వచ్చాడు చిట్టిబాబు.

"నేను మీ ఇంటికి వద్దామని అనుకుంటుంటే మీరే కన్పించారు. మంచిరోజు చూసుకుని మీ ఇంటికి మా ఆవిడను తీసుకుని వస్తాను. మా అబ్బాయి ఆ రోజు ట్రైన్‌లో మీ అమ్మాయిని చూసిన దగ్గర్నుండి ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటానని పట్టుబట్టాడు... నాకూ మీ కుటుంబంనచ్చింది....ముహూర్తాలు పెట్టుకుందాం! మరో విషయం.... వివేక్‌ను వెంటనే హైదరాబాద్ వచ్చేయమని చెప్పండి. మా ఇంట్లో ఉంటాడు. వాడిని అమెరికా పంపే ఏర్పాట్లు చెయ్యాలి" చేతికంటిన మట్టిని తుడుచుకుంటూ అన్నాడు చిట్టిబాబు.

ఆ క్షణంలో భూషయ్య తాత మాటలు గుర్తుకు వచ్చాయి. ఆయన్ని చిన్నచూపు చూసినందుకు మనసులోనే క్షమాపణలు చెప్పుకున్నాను.

– ఈనాడు ఆదివారం, 9 జనవరి 2005